# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 18, ఆగస్టు 2026





కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను

# యథావిధిగా కొనసాగించాలి

✷ మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు ఈ పథకాల అమలులో జాప్యం, నిలిపివేత యత్నాలను నిరసిస్తూ మంచిర్యాల కార్పొరేషన్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విజిత్ కుమార్ విమర్శించారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అటకెక్కించే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. సెప్టెంబర్ 9న ఈ పథకాలపై దాఖలైన పిటిషన్‌కు సంబంధించి ప్రభుత్వం తరఫున తక్షణమే అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన ప్రదేశానికి చేరుకున్న మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్, ఆందోళనకారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ మహిళా, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

❖ ఎస్ఐఆర్ ఫేజ్2పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

❖ పార్టీని మరింత బలోపేతం చేయాలి: మంత్రి జూపల్లి




**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 17, ప్రభాతవార్త**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం సోమవారం ఉట్నూర్‌లో ప్రారంభమైంది. నందిరెడ్డి గార్డెన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమావేశం కొనసాగుతోంది. ఎస్ఐఆర్ ఫేజ్2లో భాగంగా బీఎల్ఏ2 కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించాలని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలికాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ మిగతా 2లో..

జిల్లా ఉద్యోగులందరికీ

# మీ ప్రమాణం యాప్ తప్పనిసరి

నమోదు చేయని శాఖలపై కఠిన చర్యలు: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్‌లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్‌లో మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పన అంశాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. యాప్‌లో నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు ప్రతిరోజూ సిబ్బంది హాజరు వివరాలను పర్యవేక్షించాలని సూచించారు.అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పన కోసం ప్రతి శాఖ తమ పరిధిలోని పూర్తి వివరాలను ఎలాంటి లోపాలు లేకుండా అందించాలని ఆదేశించారు. విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తాజా సమాచారాన్ని సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రం లోని జనకాపూర్ కు చెందిన సొన్నాయిల మానస తనకు దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం అంకుషాపూర్ కు చెందిన సోగాల కోమల్ తనకు జనకాపూర్ శివారులో గల పట్టా భూమిని కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించాలని, ఆసిఫాబాద్ మండలం పర్సా నంబాల గ్రామానికి చెందిన దుర్గం హనుమంతు మిగతా 2లో..

# నవజాత శిశువు మృతి కేసులో తల్లి సహా ముగ్గురు అరెస్ట్

## మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు: డీసీపీ ఎ. భాస్కర్

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**

సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవజాత మగ శిశువును చెట్ల పొదల్లో వదిలివేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా గర్భం దాల్చిన గోమాస సంధ్య, అబార్షన్ మాత్రలు వాడి ఈనెల 10న జన్మనిచ్చిన పసికందును రామగిరి శ్రీనివాస్ సాయంతో లక్ష్మీనగర్ సమీపంలోని చెట్ల పొదల్లో పడేసింది. స్థానికుల సమాచారంతో పోలీసులు శిశువును ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రధాన నిందితురాలు సంధ్యతో పాటు అబార్షన్ మాత్రలు సమకూర్చిన మెడికల్ షాప్ ఉద్యోగులు తంగళ్ళపల్లి మనోజ్ కుమార్, చెల్లోజు సాయి కృష్ణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మాత్రల స్ట్రిప్, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రామగిరి శ్రీనివాస్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన దర్యాప్తు అధికారి, రూరల్ సీఐ గోపతి రవీందర్, సీసీసీ నస్పూర్ ఎస్ఐలు ఎం. ప్రశాంత్, టి. జితేందర్ సింగ్, ఏఎస్సై ఎండీ ఇజాజ్, కానిస్టేబుళ్లు వెంకటసాయి, నరేందర్, ఇతర సిబ్బందిని డీసీపీ భాస్కర్ అభినందించారు.



# సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు

## - బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మాండ్ల జగదీష్

**తిర్యాని,ఆగస్టు17, ప్రభావార్త**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ, వాటి పేర్లు మార్చే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మాండ్ల జగదీష్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక కొమురం భీం చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు తదితర పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని జగదీష్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు ఎంతో లబ్ధి పొందాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యం రాజయ్య, చుంచు శ్రీనివాస్, బుర్ర మధూకర్, చేని కుమార్, వెన్న సంతోష్, రేగోండ రమేష్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గౌహతిలో తెలంగాణ సంస్కృతి ఘన ప్రదర్శన

## - బతుకమ్మ, బోనాలు, పేరిణి నృత్యాలతో

## మంత్రముగ్ధులైన పదహారు రాష్ట్రాల ప్రతినిధులు

**మంచిర్యాల, ఆగస్టు 17, ప్రభాతవార్త**

అస్సాంలోని గౌహతి పట్టణంలో జూలై 11 నుంచి ఆగస్టు15 వరకు జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మంచిర్యాల జిల్లా ప్రతినిధి దాసరి రమేష్ ఘనంగా చాటిచెప్పారు. మంచిర్యాల టీజీ మోడల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమేష్ తెలంగాణ తరఫున పాల్గొన్నారు. పదహారు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి విద్యాశాఖ తరఫున ఐదుగురు ప్రతినిధులు హాజరయ్యారు. రమేష్ బతుకమ్మ, ఆషాఢ బోనాలు, పేరిణి నృత్య ప్రదర్శనలతో తెలంగాణ వైభవాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా పోతరాజు వేషధారణలో చేసిన బోనాల నృత్య ప్రదర్శన, పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మకు సంబంధించిన సత్తు ప్రసాదం పంపిణీ చేస్తూ తెలంగాణ ఆచారాలు, సంప్రదాయాల విశిష్టతను ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు వివరించారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించిన రమేష్ ప్రదర్శనలు అధికారులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతికి గౌరవాన్ని తీసుకురావడంపై రమేష్‌ను పలువురు అభినందించారు.




# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

## - హైకోర్టు స్టేతో లబ్ధిదారులు ఇబ్బందులు.. ఎంపీడీవోకు బీఆర్ఎస్ నేతల వినతి

**సిర్పూర్(టి), ఆగస్టు 17 ,ప్రభాతవార్త:**



కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం సిర్పూర్(టి) మండల ఎంపీడీవోకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అస్లాం బిన్ అబ్దుల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనా వైఫల్యం, సరైన విధానాలు అమలు చేయకపోవడం వల్లే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఈ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు. పథకాలపై స్టే కారణంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే అవసరమైన చర్యలు చేపట్టి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి వర్మ, దేవిదాస్, సునీల్, రత్నాకర్, ఘూస్సీ, నవీన్, సోఫీ, భారత్ తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచండి

## - ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన భాజాపా నాయకులు

**చెన్నూరు, అగస్ట్ 17, ప్రభాతవార్త**

చెన్నూర్ పట్టణంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు, ప్రజా సమస్యలపై ప్రజావాణిలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో అంబేద్కర్ చౌక్ నుండి రావిచెట్టు వరకు అర్థాంతరంగా ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి స్పష్టత లేకుండా రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించి, నాలుగు నెలలు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. రోడ్డు వెడల్పు, డ్రైనేజీ నిర్మాణం, లైటింగ్ వ్యవస్థపై ప్రజలకు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని అన్నారు. రోడ్ల కూల్చివేతల వల్ల పేరుకుపోయిన శిథిలాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనివల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరుతోందని, ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించి పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, కౌన్సిలర్ గర్రబెల్లి శాంత వెంకట నరసయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కాగిత వెంకటేష్, మోనిక రౌతు శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్, సీనియర్ నాయకులు కొండపాక చారి, తలారి రాజులు, తుమ్మ చిరంజీవి, ఆడప శ్రీనివాస్, గడ్డం మల్లయ్య, వెంకట్, రాజన్న, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. కమిటీల నియామకాలపై సమీపట్టణ, డివిజన్, మండల స్థాయి కాంగ్రెస్ కమిటీల నియామకాలు, పార్టీ కార్యాలయాల నిర్మాణం, సంస్థాగత బలోపేతంపై సమావేశంలో చర్చించారు. జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. స్థానిక రాజకీయ పరిస్థితులపై చన్నియోజకవర్గాల వారీగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకలాపాలపై నేతలు సమీక్షించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచి పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. సమావేశంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు సోయం బాపురావు, కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత కంటి వైద్యం అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు డా. శ్రీనివాస్

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**



మానవత్వానికి నిలువుటద్దంలా శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి ౹-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఉచిత కంటి వైద్య సేవల ప్రయాణాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ప్రతి మంగళవారం కాగజ్‌నగర్‌లోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా ఈ వారం క్యాటరాక్ట్ (కంటి శుక్లాలు) సమస్యతో బాధపడుతున్న 13 మందికి ఉచిత ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు చేపట్టారు. బాధితులను సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ తమ సొంత ఖర్చులతో సురక్షిత రవాణా సదుపాయం, ఉచిత భోజన వసతి కల్పిస్తూ ఆపరేషన్ల నిమిత్తం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత 9 సంవత్సరాలుగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వేలాది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్ల ద్వారా తిరిగి కంటి చూపు పొందిన ప్రతి ఒక్కరూ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న తమ చుట్టుపక్కల వారికి సమాచారం అందించి, ఈ వైద్య శిబిరాలకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ క్యాంప్ ఇంచార్జ్ గోపికృష్ణతో పాటు కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేపల్లెవాడలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి

**తాండూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల రేపల్లెవాడలో కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ జ్యోత్స్న కు సర్పంచ్ ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆ రెండు గ్రామాల ప్రజలు కొత్తపల్లి గ్రామంలోని రేషన్ దుకాణానికి వెళ్లిఎన్నో ఇబ్బందులతో రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపల్లెవాడలోనే.కొత్త రేషన్ షాప్ ఏర్పాటు చేయడం వల్ల దాదాపు 300 కుటుంబాలకు సరైన సౌకర్యం కలుగుతుందన్నారు. ఎంపీడీవో, తహసిల్దార్ సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కట్కూల మల్లేష్, వార్డ్ మెంబర్ చంద్రశేఖర్, నాయకులు చీకటి వెంకటేష్, కొల్లూరి ప్రకాష్, కోట శంకర్, ఆకుల కుమార్, ఆకుల తిరుపతి, శంకర్, ఎరుకట్ల మల్లేష్, సిర్రం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు ఇంఛార్జి మంత్రి రాక

## - అదనపు పిఎస్ టు మినిస్టర్ కాసుల నానిల్ కుమార్

**ఆసిఫాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

ఈ నెల 18న రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కుమురం భీం జిల్లాకు రానున్నారని అదనపు పిఎస్ టు మినిస్టర్ కాసుల నానిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 9.30 గంటల నుండి 11.30 గంటల వరకు జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని రన్ గ్రాండ్ బంక్వేట్ హాల్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని, మధ్యాహ్నం 12 గంటలకు వాంకిడి మండల కేంద్రంలో వాంకిడి నుండి కాగజ్ నగర్ వరకు 8.50 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన హెచ్ఎల్బి రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తారని, మధ్యాహ్నం 12.45 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకంలో భాగంగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, ఇందిరమ్మ ఇండ్ల రెండో విడతలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తు లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం క్యాతనపల్లి లోని గాంధీనగర్ కు చెందిన



లింగంపల్లి లక్ష్మి తాము దినసరి కూలీగా పని చేసుకుంటూ జీవిస్తున్నామని, రెండు పడక గదుల ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మొగిలి మల్లయ్య తనకు వారసత్వంగా వచ్చిన భూమిని తన అన్నదమ్ములు దౌర్జన్యంగా ఆక్రమించుకొని బెదిరిస్తున్నారని, ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం మాల గురుజాల గ్రామ సర్పంచ్ పెద్దబోయిన శ్యామలత తమ గ్రామ రైతులకు పంటల సాగు కొరకు మత్తడి మరమ్మత్తులకు తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల రాజమణి, పెరుగు తిరుపతి లు తమకు గల పట్టా భూమిలో సాగు కొరకు ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీకి చెందిన ఓరుగంటి నరసమ్మ తమ ఇంటి పక్కన డంపింగ్ యార్డ్ ఉండడంతో దోమలు, ఈగలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, డంపింగ్ యార్డ్ తొలగించి తగు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 17ను బహుజనుల హక్కుల దినంగా ఘనంగా జరుపుకుందాం

**బెల్లంపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

ఆగస్టు 17ను బహుజనుల హక్కుల దినంగా ఘనంగా నిర్వహించుకుందామని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి గోమాస రాజం అధ్యక్షతన బహుజనుల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు మాట్లాడుతూ శతాబ్దాలుగా సామాజిక వివక్ష, అణచివేతకు గురైన బహుజన వర్గాలకు విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, సమానత్వం వంటి హక్కులు లభించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎంతో కీలకమని అన్నారు. నేడు బహుజన విద్యార్థులు డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్, వైద్య, న్యాయ విద్యను అభ్యసిస్తూ వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి వంటి ప్రజాప్రతినిధులుగా బహుజనులు ఎన్నికవుతూ పాలనలో భాగస్వాములు కావడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో జరిగిన సామాజిక, రాజకీయ పోరాటాల చరిత్రను నేటి యువత, విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనుల హక్కులు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 17ను బహుజనుల హక్కుల సాధనకు సంబంధించిన చారిత్రక దినంగా గుర్తించి, హక్కులు-సమానత్వం-సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు బత్తుల రాజలింగు, కార్యదర్శులు కారెంగుల మల్లేష్, భోగే రాజయ్య, గోగర్ల శేఖర్, కోశాధికారి దాసరి బానయ్య, నాయకులు కామెర దుర్గయ్య, బొంకురి రామచందర్, కడపాక శంకర్, గద్దల ధర్మేంద్ర, కుమారస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగించాలని భారీ ర్యాలీ

- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత

**జన్నారం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ పథకాలను కొనసాగించాలని సోమవారం జన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని నిలిపివేయడానికి నిరసిస్తూ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారామ్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద ఆడపడుచుల వివాహానికి సహాయం అందించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించిందని అన్నారు. అటువంటి పథకాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాటిని నిర్వీర్యం చేసే విధంగా వివరిస్తుందని అన్నారు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సులభ జనార్ధన్, జాడి గంగాధర్, ఫజల్ ఖాన్, బోర్లకుంట ప్రభుదాస్, భరత్ కుమార్, విజయ్ ధర్మ, శ్రీనివాస్ గౌడ్, మున్వర్ అలీ ఖాన్, బాణావత్ రాములు నాయక్, బందెల సాగర్, రాకేష్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





ఉచిత శిబిరంలో పాల్గొన్న జిల్లా ఆరోగ్య వైద్యాధికారి లైన్స్ క్లబ్ సభ్యులు

## లయన్స్ క్లబ్ సేవలు అమూల్యం

- ఉచిత నేత్ర వైద్య శిబిరంతో పేదలకు అండ

**మంచిర్యాల, ఆగస్టు 17, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని గొల్లవాడ యూనియన్ కార్యాలయ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల గర్మిళ్ల ఆధ్వర్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమన్నారు. 30 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, మోతెబిందు శస్త్రచికిత్సలకు అర్హులను గుర్తించి కరీంనగర్ రేకుర్తి కంటి దవాఖానకు తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాల ఫ్రేమ్‌లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ గర్మిళ్ల సభ్యుల సేవలను డా. నరేందర్ రాథోడ్ అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సదానందం, వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుర్రాల చక్రధర్‌రావు, జోనల్ చైర్‌పర్సన్ ముఖేష్, అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, కార్యదర్శి కాసం మల్లికార్జున్, నేత్ర శిబిరం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, రేకుర్తి కంటి దవాఖాన వైద్యులు, ఏఎన్ఎంలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి తండలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**బెల్లంపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని లంబాడి తండ గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్ సహకారంతో, సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 2వ, 3వ, 8వ వార్డుల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను, 7వ వార్డులో నూతన బోరు పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యంతో పాటు తాగునీటి వసతి కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. లంబాడి తండ గ్రామపంచాయతీని ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ సాగర్ల లక్షుుుుణ్ తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జిళ్ళ రజిత ప్రశాంత్, మండల అధ్యక్షులు రాజన్న, మాజీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగతి సత్యనారాయణ, బెల్లంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వంగ రామన్న గౌడ్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముతే భూమన్న, ఉప సర్పంచ్ డాకూరి సురేష్, వార్డు సభ్యులు కందుల వసుంధర, పంచాయతీ సెక్రటరీ శిరీషతో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

### 23న అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సైరన్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 600 మంది ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.1,000 కోట్లతో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆటోనగర్ల ఏర్పాటు వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఆటో డ్రైవర్లకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సుల రెన్యూవల్, కొత్త లైసెన్సుల జారీ ప్రక్రియను నిలిపివేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లైసెన్సుల రెన్యూవల్, కొత్త లైసెన్సుల జారీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసీ డిపోలలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారని, ఫైనాన్స్ బకాయిలు చెల్లించలేక తీవ్రంగా నష్టపోయారని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ప్రధాన బస్టాండ్ వద్ద ప్రత్యేక ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐకాసా సభ్యుల ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

**రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి..**

ఆటో డ్రైవర్ల సమస్యల్లో ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాకపోతే ఆగస్టు 23వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి, అంటే ఆగస్టు 24వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు 600 మంది ఆటో డ్రైవర్లకు కట్ట రామ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐక్య పోరాటాలతోనే ఆటో కార్మికుల హక్కులను సాధించుకోగలమని, రానున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ట్రాక్టర్‌తో వీల్స్ కొడుతుండగా ప్రమాదం



### కాలు ట్రాక్టర్‌లో పడి యువకుడికి తీవ్ర గాయాలు

**వేమనపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

పొలంలో ట్రాక్టర్‌తో వీల్స్ కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలు ట్రాక్టర్‌లో పడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వేమనపల్లి మండలం కొత్తకాలిని గ్రామ సమీపంలోని పొలంలో సోమవారం చోటుచేసుకుంది. గొర్లపల్లి గ్రామానికి చెందిన నెందుగురి నాగేష్ ట్రాక్టర్‌తో వీల్స్ కొడుతుండగా ప్రమాదం జరిగింది. కాలికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు నాగేష్‌ను పొలం నుంచి రోడ్డుపైకి తీసుకొచ్చి 108కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది నాగేష్‌కు ప్రథమ చికిత్స అందించి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ జాడి స్వరూప, పైలట్ కె. సంపత్ సేవలందించారు.

## 2026-27 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలల ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న 9 గురుకుల పాఠశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్/సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 5 బాలుర గురుకుల పాఠశాలలు, 4 బాలికల గురుకుల పాఠశాలలలో ఈ నెల 20వ తేదీ నాటికి వివిధ కమ్యూనిటీ/క్యాస్ట్ కేటగిరీలలో అందుబాటులో ఉండే ఖాళీల ఆధారంగా అదే రోజు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వీటీజీ సెట్/బీఎల్‌వి సెట్-2026 ప్రవేశ పరీక్షకు హాజరైన బాలబాలికలు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఆర్ఫన్, సెమీఆర్ఫన్ బాలబాలికలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన బాలబాలికలు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల లోపు నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో స్వయంగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత మెరిట్ జాబితా రూపొందించబడుతుందని, అనంతరం జిల్లాలోని 9 గురుకుల పాఠశాలలలోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు వివిధ కమ్యూనిటీ/క్యాస్ట్ కేటగిరీలలో అందుబాటులో ఉన్న ఖాళీలను నిబంధనల ప్రకారం భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. కమ్యూనిటీకి చెందిన ఆర్ఫన్, సెమీఆర్ఫన్ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించిన అనంతరం, మిగిలిన ఖాళీలను వీటీజీ సెట్/బీఎల్‌వి సెట్-2026 ర్యాంక్ కార్డులోని మెరిట్ క్రమం ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు వీటీజీ సెట్/బీఎల్‌వి సెట్-2026 ర్యాంక్ కార్డు, కులం/కమ్యూనిటీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆర్ఫన్, సెమీఆర్ఫన్ కు సంబంధించిన ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు జత చేయాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## చెన్నూరులో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

**చెన్నూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త**

కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి చేసిందంటూ బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించినప్పటికీ పోలీసుల ఆంక్షలను ధిక్కరించి బీఆర్ఎస్ శ్రేణులు నిరసన సాగించారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల అమలుపై హైకోర్టు స్టే విధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఆరోపించారు. పేద మహిళల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించే ఈ పథకాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా తక్షణమే పునరుద్ధరించి కొనసాగించాలని, కాంగ్రెస్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం సమర్పించారు.



## కళ్యాణలక్ష్మి పథకం రద్దుకు కుట్రను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

**వేమనపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సాయికృష్ణకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపుతో, మండల పార్టీ అధ్యక్షుడు కోళి వేణుమాధవ్‌రావు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుబిడే మధుకర్, మాజీ జడ్పీటీసీ తలండి భీమన్న, పూరాణం లక్ష్మీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడే వెంకటేశం, సర్పంచులు ఓడిల కళ్యాణి సుధాకర్, దుర్గం విఘ్నేష్, సిడెం శ్రీలత అశోక్, మాజీ సర్పంచులు, బోర్కుటి సంతోష్, దొంతుమేర, రాజలింగు, మొండి, రమేష్, పున్నం, ప్రసాద్, శ్రీకాంత్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు ప్రజావాణి ప్రారంభం

**బెజ్జూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి దరఖాస్తులను మండల అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి తొలి రోజు వివిధ శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను మండల నోడల్ అధికారి బిఎస్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. వ్యవసాయ శాఖ 01, పశు సంవర్ధక శాఖ 01, విద్యుత్ శాఖ 02, అటవీ శాఖ 03, ప్రజా ఆరోగ్యశాఖ 01, పోలీస్ శాఖ 02, గృహ నిర్మాణ శాఖ 01, పంచాయతీరాజ్ శాఖ 10, రెవెన్యూ శాఖ 03, రోడ్లు మరియు భవనాల శాఖ 02, స్త్రీ శిశు సంక్షేమ శాఖ 01 మొత్తం 27 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.





## ఆత్మీయ గృహప్రవేశం సందర్భంగా దుర్గం చిన్నయ్య శుభాకాంక్షలు

బెల్లంపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీ 34వ వార్డుకు చెందిన గండు స్పందన–సంపత్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి, శుభాకాంక్షలు, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కొత్త ఇంటిలో అడుగుపెట్టిన గండు స్పందన–సంపత్ కుటుంబానికి ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు ఎల్లప్పుడూ కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నూనేటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రేవల్లి విజయ్, సీనియర్ నాయకులు సుందర్ రావు, కొట్టే రాకేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నానో యూరియా, డిఏపి పై రైతులకు అవగాహన

జన్నారం, ఆగస్టు 17, ప్రభాతవార్త



జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో సోమవారం నానో యూరియా డిఏపి వాడకం వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి వీరన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వీరన్న రైతులకు నానో యూరియా, డిఏపి వినియోగ విధానం, పంటలలో నత్రజని,భాస్వరం వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ యూరియా వినియోగాన్ని సమర్థవంతంగా తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నానో యూరియా, డిఏపిని పంట అవసరాన్ని బట్టి సిఫార్సు చేసిన మోతాదులో ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు నత్రజని,భాస్వరం అందించవచ్చని వివరించారు. నానో యూరియాను శాస్త్రీయ పద్ధతిలో, వ్యవసాయ శాఖ సూచనల మేరకు వినియోగించాలని రైతులకు సూచించారు.అలాగే సమతుల్య ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా, డిఏపి వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రీయ పద్ధతిలో వినియోగించి పంట ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరన్న, ఏఈఓ దివ్య, గ్రోమోర్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి, డిఆర్‌డిఓ, డీపీవో ఎస్. కిషన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలు, వినతులు, అభ్యర్థనలను ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖలకు సంబంధించిన సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన మరియు బాధ్యతాయుతమైన సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్‌ను నిలిపేస్తే ఊరుకోం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ భగ్గుమాటు! - పథకాన్ని కొనసాగించే వరకు పోరాటం ఆపేది లేదు

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త



పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని కంట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేయడం సరికాదన్నారు. పేదల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ నిధులను విడుదల చేసి, పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రాజకీయ కక్ష సాధింపులకు గురిచేయడం దారుణమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే తప్పించుకునే ధోరణి కాకుండా, ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పథకం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణుల భారీ హాజరుతో కంట చౌరస్తా వద్ద రాజకీయ వాతావరణం వేడెక్కింది. కల్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ పథకాన్ని పూర్తిస్థాయిలో కొనసాగించి, పేదల ప్రయోజనాలను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## ప్రజావాణిలో దివ్యాంగుల భవనం కోసం భూమి కేటాయించాలని వినతి

సారంగాపూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, సారంగాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు సంఘ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మొదటి రోజు నిర్వహించిన ఈ ప్రజావాణి కార్యక్రమంలో సారంగాపూర్ మండల స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు పాల్గొన్నారు. మండలంలో ఉన్న దివ్యాంగుల అవసరాల నిమిత్తం 100/100 కొలతలతో కూడిన స్థలాన్ని కేటాయించి, సంఘ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ఇన్చార్జ్ ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, తహశీల్దార్ విజయ్‌కాంత్ రావుకు సంయుక్తంగా వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సాకలి సురేందర్, మండల ఉపాధ్యక్షుడు చవాన్ ప్రకాష్, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

- ట్యాంక్‌బండ్‌పై కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:



తెలంగాణ తొలి స్వరాజ్య పాలకుడు, తెలంగాణ శివాజీగా కీర్తించబడే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఆగస్టు 18న సాయంత్రం ప్రతిష్ఠించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా గౌడ సోదరులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. స్వరాజ్య సాధనలో పాపన్న గౌడ్ త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్మల్ జిల్లా గౌడ సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, రాష్ట్ర నాయకుడు గోపి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ పాపన్న గౌడ్ ఆత్మగౌరవ పోరాటానికి గుర్తుగా నిలిచే ఈ విగ్రహ ఆవిష్కరణలో జిల్లా గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన పీసా మొబిలైజర్లు

- ఐఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాల చెల్లింపుపై హర్షం

జైనూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్రంలోని ఐదో షెడ్యూల్ ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పీసా కోఆర్డినేటర్లు, మొబిలైజర్లకు ఐఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల మొబిలైజర్లు హర్షం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 1475 ప్రకారం తొమ్మిది ఏజెన్సీ జిల్లాలకు చెందిన పీసా జిల్లా కోఆర్డినేటర్లు, మొబిలైజర్లకు ఐఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు అందజేసేలా ఉత్తర్వులు జారీ కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులతో సమానంగా సకాలంలో వేతనాలు అందుతాయని తెలిపారు. పీసా సిబ్బంది దశాబ్దాల కల నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసా మొబిలైజర్ల సంఘం జైనూర్ మండల అధ్యక్షుడు మెస్రం జంగు, మొబిలైజర్లు మెస్రం తానాజీ, పూసం భీమ్రావు, యాదవరావు, లక్ష్మణ్, మెస్రం మారుతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉట్నూర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పి.ఏ.సి సమావేశం

- పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చ

నిర్మల్, ప్రభాతవార్త:



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పి.ఏ.సి) సమావేశం సోమవారం ఉట్నూర్ పట్టణంలోని జి.ఎన్.ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీని గ్రామ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావడం, ప్రజా సమస్యలపై సమన్వయంతో పనిచేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. బూత్ కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని, ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. రైతులు, గిరిజనులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని కూచాడి శ్రీహరిరావు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దొంగల ఆటకు చెక్ పెట్టిన నిర్మల్ పోలీసులు

**- టైగర్స్ టాస్క్‌ఫోర్స్ దర్యాప్తులో 25 కేసుల ఛేదన**



**నిర్మల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న దేవాలయ చోరీలు, ఇంటి దొంగతనాలకు నిర్మల్ పోలీసులు చెక్ పెట్టారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేక ఆదేశాలతో ఏర్పాటైన టైగర్స్ టాస్క్ ఫోర్స్ బృందం సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుంది. వీరి ప్రమేయం జిల్లాలోని 25 చోరీ కేసుల్లో ఉన్నట్లు గుర్తించి, అందులో 16 కేసులకు సంబంధించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందం సీసీ కెమెరా ఫుటేజీలు, పాత నేరస్థుల కదలికలను విశ్లేషించి వలపన్ని నిందితులను పట్టుకుంది. అదుపులోకి తీసుకున్న రాజశేఖర్, రాజేశ్వర్, శ్రీకాంత్, రామ్ చరణ్, క్రాంతిల వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు, 7 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ టౌన్, రూరల్, మామడ, సారంగాపూర్, లోకేశ్వరం, లక్ష్మణచాంద, తానూర్ మండలాల్లోని పలు ఆలయాలు, ఇళ్లలో జరిగిన చోరీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం, ఏలూరు పరిధిలోని ఆలయాల్లోనూ ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులను సమర్థవంతంగా ఛేదించిన ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు లింబాద్రి, గణేష్, శ్రీకాంత్, ఎస్.కె. గఫార్, హెడ్ కానిస్టేబుల్ జగన్ సింగ్, కానిస్టేబుళ్లు తిరుపతి, సతీష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చోరీలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని, నిఘా తీవ్రతరం చేశామని ఎస్పీ స్పష్టం చేశారు.

# పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**అధికారులకు అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆదేశం**



**నిర్మల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వారపు ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క దరఖాస్తును పెండింగ్‌లో ఉంచొద్దని స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు త్వరితగతిన న్యాయం చేయాలని, జాప్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రజావాణిలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయి. అదనపు కలెక్టర్ ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

**సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ**

**నిర్మల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**



ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్మల్ జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల విభాగం సోమవారం విడుదల చేసింది. జిల్లాలోని ఖానాపూర్, నిర్మల్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఉప జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్ తెలిపారు. ముసాయిదా ప్రకారం జిల్లాలో మొత్తం 6,42,174 మంది సాధారణ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,11,521 మంది, మహిళలు 3,30,624 మంది, థర్డ్ జెండర్ 29 మంది ఉన్నారు. అదనంగా 8 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 992 మంది సర్వీస్ ఓటర్లు నమోదయ్యారు. నియోజకవర్గాల వారీగా ఖానాపూర్‌లో 2,00,165 మంది, నిర్మల్‌లో 2,19,763 మంది, ముథోల్‌లో 2,22,246 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. కొత్తగా అర్హత పొందిన వారు కూడా ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చు. వచ్చిన అభ్యంతరాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి, షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని కిషోర్ కుమార్ వెల్లడించారు. ముసాయిదా జాబితా డీఈవో కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లోని బూత్ లెవల్ అధికారుల వద్ద అందుబాటులో ఉంటుంది. ప్రజలు తమ పేర్లను సరిచూసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు.



# జన్నారం ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

**100కు పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు**

**జన్నారం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

జన్నారం ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో మద్రాస్ ఆటోమొబైల్స్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ తేజస్ బాబు, వివిఎల్ఆర్ ఫ్యాబ్రికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎల్ అండ్ టి కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతి నుంచి మారుతి ఫోర్‌మెన్, ఆదర్శ ఆటోమొబైల్స్ హెచ్ఆర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 100కు పైగా ఐటిఐ ఎటిసి విద్యార్థులు పాల్గొన్నారు వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు మాట్లాడుతూ ఐటిఐ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి అప్రెంటిస్‌షిప్ ఖాళీలుగా ఉన్నాయని తెలిపారు. అప్రెంటిస్‌షిప్ ద్వారా నైపుణ్యాలు మెరుగుపడిన అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మంచి వేదిక అని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వై రమేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు.



# నానో ఎరువులతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు

**హాజీపూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**

నానో ఎరువులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం తో పాటు, సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు హాజీపూర్ మండల వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శనను గొల్లపల్లి గ్రామంలో డ్రోన్ ద్వారా నానో యూరియా నానో డిఏపి వినియోగించే విధానం, పంట దశల ప్రకారం ఎరువుల మోతాదు వివరాలు రైతులకు తెలియచేశారు. డ్రోన్‌ను ఉపయోగించి రైతులు పెట్టుబడిని తగ్గించుకోవచ్చు అన్నారు. అలాగే రైతులు వరి పంట బదులుగా ప్రత్యామ్నాయ పంటలు పప్పు దినుసులు ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కొమురయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు

# బెంజమిన్ కుటుంబ సభ్యులకు పరామర్శ.. మనోధైర్యం చెప్పిన ఎమ్మెల్యే

**మంచిర్యాల, ఆగస్టు 17, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు బెంజమిన్ అనారోగ్యంతో మృతి చెందగా, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు వొడ్డె రాజమౌళి, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

నాగుల పంచమి వేడుకలను భక్తులు సోమవారం జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కేస్లాపూర్ నాగసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని నాగదేవతలను ప్రార్థించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆలయం అర్చకుడు శిరీష శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీ, బ్రాహ్మణవాడ, జన్కాపూర్, భగత్‌నగర్, రాజంపేట తదితర ప్రాంతాల్లో భక్తులు నాగదేవతలకు పూజలు చేసి పుట్టల్లో పాలు పోశారు. ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**పెంచికల్‌పేట్, ఆగస్ట్ 17, ప్రభాతవార్త :**

దహెగాం మండలం చిన్న రస్పల్లి పరిసర గ్రామాల నుంచి కొనుగోలు చేసి 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా సోమవారం అధికారులు పట్టుకున్నారు. ఎన్ఫోర్స్మెంట్ డీటీ రాజ్ కుమార్, ఎస్సై అనిల్ కుమార్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పెంచికల్ పేట్ వద్ద టాటా పికప్ (ఏపి01వై4233) వాహనాన్ని సైజ్ చేశారు. కాగజ్ నగర్ కు చెందిన ఖాజా, అస్లామ్ హుస్సేన్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీడీఎస్ బియ్యం దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బీసీ మహిళలకు ఆటోమొబైల్ కిట్లు మంజూరు

**ఆసిఫాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆటోమొబైల్ కిట్లను మంజూరు చేసిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన మహిళలకు సెప్టెంబర్ 15 నుంచి 20 వరకు ఆటోమొబైల్ కిట్ల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వితంతులు, విడాకులు పొందిన మహిళలు, ఒంటరి మహిళలు, అనాథలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు టిజిఓబిఎంఎంఎస్ వెబ్ పోర్టల్ ద్వారా చేసుకోవాలని సూచించారు. అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కోరారు.

## శివాలయంలో నాగుల పంచమి వేడుకలు

### శివనామ స్మరణలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

**చెన్నూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త**

చెన్నూరు పట్టణంలోని ప్రముఖ శివాలయం ఆవరణలో శ్రావణ సోమవారం, నాగుల పంచమి ఒకే రోజు రావడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఉదయం నుంచే మహిళా భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పుట్టల్లో పాలు పోసి, జొన్న పేలాలు, పసుపు, కుంకుమలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని నాగదేవతను ప్రార్థించారు. శ్రావణ సోమవారంతో పాటు పంచమి తిథి కూడా కలిసి రావడంతో శివాలయ ప్రాంగణం శివనామస్మరణ, నాగదేవత పూజలతో మార్మోగింది.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలి

**- కాంగ్రెస్ వైఖరికి నిరసన.. కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా**





తాండూర్ ఐబిలో రాస్తారోకో చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

కల్యాణలక్ష్మి -షాదీ ముబారక్ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ఈ పథకాలతో వేలాది పేద కుటుంబాలకు ఆర్థికంగా అండ లభించిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను కొనసాగించడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా పథకాన్ని రద్దు చేసే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో సంక్షేమ పథకాలను నిలిపివేయకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ప్రయోజనం అందించాలని బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ తాండూర్ మండల కేంద్రంలోని ఐబి జాతీయ రహదారిపై సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపి వేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా ఉన్న వాటిని రద్దు చేసేందుకు కుటిల యత్నాలు చేస్తోందని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలతో ఎంతో మంది పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లిల్లకు ఎంతో అండగా ఉంటుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగిస్తామని, అదనంగాతులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాన్ని కూడా నిలిపివేసే కుట్రలు చేయడం దుర్మార్గమన్నారు. రైతు భీమా విషయంలో కూడా కనీసం ప్రీమియం చెల్లించకుండా రైతు కుటుంబాలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాస్తారోకో అనంతరం ఎంపీడీవో కార్యాలయం వెళ్లి ప్రజా ఫిర్యాదుల విభాగంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, నాయకులు ప్రణయ్ కుమార్, సురేష్ బాబు, గట్టు సంతోష్ కుమార్, ఎల్క రాంచందర్, శ్రీరాములు, బోడ సతీష్, పోశం, సత్యనారాయణ, బాబుఖాన్, ఇక్బాల్, చింటూ, ప్రదీప్ రావు, క్రాంతి కుమార్, శ్రీనివాస్, చోదన్, కోల జ్యోతి, రాజమణి, గుండేటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**లింగాపూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

లింగాపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆడబిడ్డల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నాడు మన ప్రియతమ నాయకుడు కెసిఆర్ నిరుపేద ఆడబిడ్డలకు మేనమామలా నిలబడి, వారి పెళ్లిళ్లకు ఆర్థిక భారంగా మారకుండా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఒక వరంగా అందించారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి నిధులు ఆపేసి, పరోక్షంగా రద్దు చేయడానికి కుట్రలు చేస్తోంది, పేద ఇంట్లో పెళ్లికి అండగా నిలిచే కల్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేయడం ఎంతమాత్రం సరైనది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆలోచన విరమించుకోవాలి అని జాదవ్ రాజశేఖర్ లింగాపూర్ సర్పంచ్ తెలిపారు. జాటోత్ రాహుల్ లింగాపూర్ మండల బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ ఈరోజు నాగుల పంచమి పండుగ సందర్భంలో చెప్తున్నాం పేద ఆడబిడ్డల కడుపు కొడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి ఈ ఆదివాసీ, గిరిజన నిరుపేద ఆడబిడ్డల శాపం తప్పక తగులుతుంది ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఎటు పోయింది ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రజలకు మేలు చేసేలా ప్రభుత్వం అండగా నిలవాలి. కానీ ఇలా పేదల నోటికాడి కూడు లాక్కునేలా పథకాలు రద్దు చేయడం అన్యాయం. వెంటనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ బకాయిలను విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలి లేనిపక్షంలో తెలంగాణ వ్యాప్తంగా ఆడబిడ్డలను ఏకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తాం అని తెలిపారు. ధర్నా అనంతరం మండల అభివృద్ధి అధికారికి కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మాజీ జడ్పీటీసీ ఆడే లక్క నాయక్, మాజీ ఎంపీపీ జాధవ్ గౌరీ గణపత్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు రాంచందర్, బాబులల్, ప్రేంసింగ్ మరియు కార్యకర్తలు, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు, రైతులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ నాయకుల ధర్నా

**బెజ్జూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం బిఆర్ఎస్ నాయకులు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అసమర్థత వల్లే హైకోర్టు ఈ పథకాలపై స్టే విధించిందని, పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఈ పథకం అండగా నిలిచిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని లేకపోతే భవిష్యత్తులో భారీ ఎత్తున ఉద్యమిస్తామని వారన్నారు. ఈ పథకం రద్దు తో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి, న్యాయ పోరాటం చేసి ఈ పథకాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగాపూర్ మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు



తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న బిఆర్ఎస్ నాయకులు





# చిన్నపాటి వర్షానికే.. రోడ్డు బురదమయం

## - బురదమయమైన దేవాజిగూడ రోడ్డు

**దహెగాం,ఆగష్టు 17,ప్రభాతవార్త :**

అ ఊరిని జదారిచ్ద్రం వెంటాడుతుంది. చిన్నపాటి వర్షాలకే రోడ్డు మొత్తం బురదమయం అవుతుంది. ఇది దహెగాం మండలంలోని బీబ్రా గ్రామపంచాయతీ పరిధిలోని దేవాజిగూడ గ్రామ రోడ్డు ప్రయాణం సాగించాలంటే నరకప్రాయంగా మారుతుంది అత్యవసరంగా ఎటు వెళ్లలేని పరిస్థితి ఎక్కువ వర్షం పడితే ఆటోలు, బైక్ లు అటు ఇటు జారుకుంటు వెళ్తాయి బైక్ లు అదుపుతప్పి పడుతున్నాయి. వర్షాకాలంలో నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, రేషన్ బియ్యం తెచ్చుకోవాలన్నా ప్రయాణం నరకప్రాయంగా అవుతుందని ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డు బురదమయం కావడంతో ఆటోలు దిగబడ్డాయి వేరే వాహనం సహాయంతో ప్రక్కకు లాగారు అ గ్రామ నుండి పిల్లలు 3 కిలోమీటర్లు దూరం వచ్చి చదువుకుంటున్నారని ఇకనైనా ప్రభుత్వం చొరవ తీసుకోని శాశ్వత బిటి రోడ్డు వేసి సౌకర్యం కల్పించాలని అ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

### పట్టించుకున్నోళ్లు లేరు : దాసరి సాయి కిరణ్, దేవాజిగూడ గ్రామం

మా గ్రామ రోడ్డును పట్టించుకున్నోళ్ల లేరు చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం బురదమయం అవుతుంది. పెద్ద వర్షం పడితే అంతే సంగతులు రోడ్డులో ప్రయాణం సాగించాలంటే నరకప్రాయంగా మారుతుంది.




## వట్టివాగు నీళ్ల కోసం రైతుల ధర్నా

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

వట్టివాగు ప్రాజెక్టు నుంచి వరి పంటలకు సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. నీళ్ల విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు నినాదాలు చేశారు. రైతుల ధర్నాకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మద్దతు తెలిపారు. ధర్నా స్థలానికి చేరుకున్న ఆమె రైతులతో కలిసి ఆందోళనలో పాల్గొని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి పంటలను కాపాడేందుకు సాగునీరు ఎంతో అవసరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి వట్టివాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ధర్నాలో ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని విడుదల చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు

## పెంచికల్‌పేట్‌లో ప్రజావాణి ప్రారంభం

**- ఆరు వినతుల స్వికరణ..సత్వర పరిష్కారానికి చర్యలు**

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 17, ప్రభాతవార్త :**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో మండలంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి ప్రజావాణిలో ప్రజల నుంచి ఆరు వినతులు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, భూ సమస్యలు, తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, విద్యుత్, పథకాలు పథకాలు, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వినతులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవీందర్ తో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

**దహెగాం, ఆగష్టు 17,ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోనే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు తహసీల్దార్ మునవీర్ షరీఫ్, ఎంపిడివో నస్రూల్లా ఖాన్ తెలిపారు. సమస్యలు ఉంటే ప్రజావాణి లో దరఖాస్తులు పెట్టాలని సూచించారు. సోమవారం నాడు ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి దరఖాస్తులు స్వీకరించరు. వివిధ శాఖలకు సంబందించిన సమస్యలపై ప్రజల నుండి మొత్తం తొమ్మిది దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దు

**ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు**

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో గత 20 ఏళ్లుగా నాణ్యమైన భోజనం వండి పెడుతున్న నిర్వాహకుల సమస్యలను పరిష్కరించకుండా, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని చూడటం సరైనది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా సేవలందిస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ జులై 18వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండి రఫియా, జిల్లా కమిటీ సభ్యులు సరిత, మధునమ్మ, సబితా, ఎండి రబియా పాల్గొన్నారు.





పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

**తాండూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**

మండలంలోని ఆయా గ్రామ ప్రజలు భక్తులు సోమవారం నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు, భక్తులు పాము పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేసి, పుట్టలో పాలు పోసి నైవేద్యాలు సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

**బెజ్జూర్,ఆగస్టు 17,ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండల వ్యాప్తంగా సోమవారం నాగుల పంచమి వేడుకలు మహిళలు వారి కుటుంబ సభ్యులతో కలిసి భక్తితో నిర్వహించారు. దీంతో ఆయా ఆలయాలు భక్తులతో నిండాయి. ఈ సందర్భంగా ఉదయం ఉపవాస దీక్షతో స్థానికంగా ఉన్న నాగదేవత ఆలయాల్లో, పుట్టల్లో పాలు పోసి ప్రసాదాలు పంచారు.



పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**తాండూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త :**



తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు సంబంధిత అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి అంజయ్య, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## పంట నష్టం పరిశీలన

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 17, ప్రభాతవార్త :**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదలతో అగర్ గూడ శివారులో దెబ్బతిన్న పంటలను ఏఈఓ వంశీకృష్ణ సర్పంచ్ అల్లూరు రాజేశ్వరితో కలిసి సోమవారం పరిశీలించారు. పత్తి, వరి పంటల్లో జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఏఈఓ తెలిపారు. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపి తెగుళ్ళ నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.

